క్లుప్తంగా

కుట్టుమిషన్లు పంపిణీ



నందిగామ: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు టైలరింగ్ దోహదపడుతుందని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. మునగచర్ల సమీపంలోని పిఎస్‌సి బోస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న పలువురు మహిళలకు శనివారం ఆమె ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మహిళలకు టైలరింగ్‌పై ప్రత్యేక శిక్షణను ఇవ్వడంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయడం అభినందనీయమంటూ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ట్రస్ట్ మేనేజర్ ఎస్‌కె సుభాని, బ్యాంకు జీఎం ప్రసాద్, హెచ్‌ఆర్ సల్మా, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



కె.అగ్రహారం(జగ్గయ్యపేట): ఓటర్లు ఈవీఎంల పనితీరు, ఓటువేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల డీటీ కిషోర్ బాబు సూచించారు. కె.అగ్రహారంలోని సచివాలయం వద్ద గ్రామస్తులకు శనివారం ఈవీఎంలపై అవగాహన కలిగించారు. డీటీ మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్స్ గురించి ఓటర్లకు వివరించారు. సచివాలయ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ సూర్యారావు శనివారం అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ పనిచేసే విధానాన్ని వివరించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ కిషోర్‌బాబు, డీటీ నాగరాజు, ఆర్‌ఐ ఆనంద్‌బాబు, బీఎల్‌వోలు, ఓటర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



జగ్గయ్యపేట అర్బన్: ఓబీసీ ధ్రువీకరణపత్రాల జారీ విషయంలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారు జారీచేసిన నిబంధనలు తప్పకుండా పాటించాలని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోసూరి ప్రహ్లాద్ రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంఘ నేతలు జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయ సూపరిండింటెంట్‌కు శనివారం ఓ వినతిపత్రం సమర్పించారు. సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటిస్తే అర్హులందరికీ న్యాయం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు దేవరకొండ శ్రీనివాస్, తూమాటి కృష్ణమాచారి, పులి శ్రీనివాసరావు, వై.విజయ్, శ్రీనివాసరాజు, రాధమ్మ, అంగజాల కాశిరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణాన్ని శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జాతీయ రహదారిపై వాహనదారులు లైట్ల వెలుగులో ప్రయాణం సాగించారు. ఉదయాన్నే ఆయా పనులకు వెళ్లే కూలీలు ఈ పొగమంచు, చలిగాలుల దెబ్బకు అవస్థలుపడ్డారు.

నేడు పేరకలపాడులో గడపగడపకు మనప్రభుత్వం

కంచికచర్ల : మండలంలోని పేరకలపాడులో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కంచికచర్ల మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు తెలిపారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారని వివరించారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

రంగా స్ఫూర్తితో పేదలకు ఇళ్లపట్టాలు

విప్ ఉదయభాను



వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న విప్ ఉదయభాను

నందిగామ: కష్టాలలో ఉన్న పేదలకు అండగా నిలిచిన గొప్పవ్యక్తి వంగవీటి మోహనరంగా అని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలం మాగల్లులో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ నేతృత్వంలో కాపుసంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సామినేని ఉదయభాను మాట్లాడుతూ నాడు రంగా పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలనే ఆశయసాధన కోసం దీక్షబూని హత్యకు గురయ్యారన్నారు. రంగా ఆశయస్ఫూర్తితో మాగల్లులోని పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేపట్టినట్లు వివరించారు. పేదలకు నేనున్నానని భరోసా ఇచ్చిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. అనంతరం గ్రామంలోని 30మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాగల్లులో ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, పక్కన కె.రవిశంకర్

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ..

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మాగల్లులో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఏటిపట్టు గ్రామాలకు చెందిన క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఏటిపట్టు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రూ.12లక్షలతో మంచినీటి పైపులైన్ పనులు

చందర్లపాడు(నందిగామ టౌన్): జలజీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం పాటెంపాడు రూ.12లక్షలతో చేపట్టిన వాటర్ పైప్‌లైన్, కుళాయి ఏర్పాటు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, రాయల జానకిరామయ్య, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

ఏసీపీ జనార్దన్‌నాయుడు

కంచికచర్ల : నందిగామ సబ్‌డివిజన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని, నూతనసంవత్సర వేడుకల పేరుతో శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఏసీపీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. కంచికచర్లలోని నందిగామ రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత మద్యం తాగి బైక్‌లతో ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. శబ్ద కాలుష్యాన్ని సహించలేదిలేదన్నారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఒకరినొకరు చేయిచేయి కలుపుకుని శుభాకాంక్షలు తెలుపుకోవాలని తప్ప, సంబరాల పేరుతో ప్రమాదాల బారిన పడవద్దన్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా ఉండరాదని, రోడ్లపై న్యూ ఇయర్ కేక్‌లు కట్ చేయరాదని సూచించారు. డివిజన్ పరిధిలో పోలీసు పెట్రోలింగ్, పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించేవారు ఎంతటి వ్యక్తులైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలను ఇళ్లలోనే ఉంటూ శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా జరుపుకోవాలని సూచించారు. విలేకరుల సమావేశంలో సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్‌ఐలు సుబ్రహ్మణ్యం, మహాలక్ష్మణుడు పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని ఆరోగ్యశ్రీ

వీరులపాడు: ఆరోగ్య శ్రీ పథకం పేదల పాలిట సంజీవని అని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం సచివాలయంలో గ్రామస్తులకు శనివారం ఆమె వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైద్యం కోసం నిరుపేదలు అప్పులపాలు కాకూడదనే మంచి మనసుతో జగన్‌మోహన్‌రెడ్డి వైద్యసహాయాన్ని రూ.25లక్షల వరకు పెంచారని గుర్తుచేశారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మీ, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మీ

యువత సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

వీరులపాడు: ఆపదలో ఉన్న మహిళలను కాపాడేందుకు దిశ యాప్ ఎంతో దోహదపడుతుందని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. చెడు నడత వల్ల కలిగే నష్టాలు, దిశ యాప్ వినియోగంపై మండలంలోని జుజ్జూరు, పొన్నవరం, చెన్నారావు పాలెం గ్రామాల్లోని ప్రజలకు శనివారం రాత్రి ఆయన అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోకుండా సత్ప్రవర్తనతో నడుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మహిళల రక్షణకే రాష్ట్రప్రభుత్వం దిశ యాప్‌ను రూపొందించిందని, ప్రతి ఒక్కరు యాప్‌ను వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని సెల్‌నంబరు 9440796458 తెలియజేయాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

వత్సవాయి: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. కంభంపాడు, లింగాల, ఇందుగపల్లి, మంగొల్లు, పెద్ద మోదుగపల్లి, వత్సవాయి, వేమవరం గ్రామాల్లో శనివారం కబడ్డీ, క్రికెట్, షటిల్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఈవోపీఆర్డీ మాధవి, పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, కార్యదర్శులు కె.సంక్రాంత్, చాందుసాహెబ్, మస్తాన్‌వలి, భాను నాయక్ పర్యవేక్షించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఐదోరోజు శనివారం హోరాహోరీగా సాగాయి. మండలంలో తక్కెళ్లపాడు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించగా, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, లీలాఫణికుమార్ పర్యవేక్షించారు.

వీరులపాడు మండలంలో...

జమ్మవరం(వీరులపాడు): ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా మండలంలోని జమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కబడ్డీ, షటిల్ పోటీలను ఎంపీపీ కోటేరు లక్ష్మి ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు కర్ల రాజు, యాదాల దాసు, నన్నెబోయిన తిరుమలరావు, నాయకులు పాల్గొన్నారు.



ఇందుగపల్లిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



మంగొల్లులో కబడ్డీలో తలపడుతున్న ఆటగాళ్లు



తక్కెళ్లపాడులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు, హాజరైన క్రీడాకారులు

అయ్యప్పదీక్షా పరులకు అన్నదానం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల దీక్షలు పూర్తయిన సందర్భంగా శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ముందుగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ

చందర్లపాడు(నందిగామ టౌన్): రైతులు అధైర్యపడి బలవన్మరణాలకు పాల్పడవద్దని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెంలో అప్పుల బాధ తాళలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కౌలురైతు గుడిశ సతీష్ మృతదేహాన్ని శనివారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

లోలెవల్ బ్రిడ్జి మరమ్మతు పనుల ప్రారంభం

నందిగామ టౌన్: మండలంలోని చందాపురం సమీపంలోని లోలెవల్ బ్రిడ్జికి రూ.10.48లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా లోలెవల్ బ్రిడ్జి కింద మట్టి కొట్టుకుపోవడంతో పగుళ్లిచ్చి రాకపోకలకు అంతరాయంగా ఏర్పడిందన్నారు. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా తక్షణమే ఆయన స్పందించి రూ.10.48లక్షలు మంజూరు చేశారని చెప్పారు. త్వరలోనే బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, నాయకులు పారుపల్లి హరిబాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రాములోరి అక్షింతలు ఊరేగింపు

జగ్గయ్యపేట అర్బన్: అయోధ్య రామమందిరం ప్రతిష్టాపన సందర్భంగా అయోధ్య రాముని అక్షింతలతో శనివారం రాత్రి జగ్గయ్యపేటలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా వీధుల్లో సాగిన గ్రామోత్సవంలో కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేశారు.



మేలు చేకూరితేనే అండగా ఉండండి

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

పేరకలపాడు(కంచికచర్ల) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీ కుటుంబానికి మేలు చేకూరితేనే రానున్న ఎన్నికల్లో తమకు అండగా నిలవాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పేరకలపాడులో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి వారిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 31లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు మంజూరు చేసిన చరిత్ర దేశరాజకీయాల్లోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని, ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వివరించారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తుంచుకుని ప్రతిఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఆయనను మరోసారి సీఎం చేసుకునేందుకు అండగా నిలవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు కందుల అశోక్‌కుమార్, పాపట్ల స్వామి, పరిటాల రాము, వేల్పుల రమేష్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పేరకలపాడులో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రైతులకు ఉచితంగా లేగదూడల పంపిణీ

పేరకలపాడు(కంచికచర్ల): మండలంలోని పేరకలపాడులో సురభి గోశాల ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి పశుసంవర్ధకశాఖ నందిగామ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు హాజరై 15మంది రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాజికసేవ కార్యక్రమాల్లో భాగంగా సురభి గోశాల నిర్వాహకులు ఏడాదిన్నర వయస్సు ఉన్న లేగదూడలను రైతులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గోశాల నిర్వాహణ, రైతులకు ఉచితంగా లేగదూడల పంపిణీ కార్యక్రమాల ద్వారా గోజాతుల వృద్ధికి సురభి గోశాల నిర్వాహకుడు వల్లూరు రవికుమార్ విశేషంగా కృషిచేస్తున్నారంటూ ఆయనను అభినందించారు. గోశాల నిర్వాహకుడు రవికుమార్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ దేశీయ గోజాతుల పెంపకం, పరిరక్షణ పథకం కింద 2021లో తనకు ప్రభుత్వం రూ.15లక్షల మేర సబ్సిడీ అందించినట్లు చెప్పారు. తనకు ప్రభుత్వం సాయం అందించినందున తాను కూడా రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేస్తూ గోజాతుల గణాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. గోజాతుల పెంపకం ఆసక్తి ఉన్న రైతుల నుంచి అఫిడవిట్ తీసుకుని లేగదూడలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.



పేట పట్టణాభివృద్ధికి కృషి

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్ల వ్యవధిలోనే జగ్గయ్యపేట పట్టణంలో రూ.27.27కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పేట మున్సిపాలిటీ చరిత్రలోనే రికార్డు సృష్టించామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా పేట మున్సిపాలిటీ ప్రతిష్టను మరింత పెంచుతామని పేర్కొన్నారు. స్థానిక పురపాలకసంఘంలో పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జవాబుదారీ, పారదర్శకమైన పాలనతో ప్రజలకు మరింత చేరువ కావాలని కౌన్సిలర్లకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నందున ప్రజారోగ్యం దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రతిపక్ష సభ్యులు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొనగా, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా హామీ ఇవ్వలేదని వైస్‌చైర్మన్ ప్రభాకర్ సమాధానమిచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను తొలుత రూ.12వేల నుంచి రూ.15వేలకు, అనంతరం రూ.22వేలకు పెంచినది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు.

చెరువు అభివృద్ధి అంశంపై వాగ్వాదం..

ఎజెండాలోని 10వ అంశానికి సంబంధించి ఊర చెరువు అభివృద్ధిపై హైకోర్టులో స్టే ఉండటంతో విచారణ నిమిత్తం న్యాయవాదిని నియమించేందుకు అయ్యే ఖర్చు మున్సిపాలిటీ ఎందుకు భరించాలని ప్రతిపక్ష సభ్యురాలు రామలక్ష్మి ప్రశ్నించగా, ప్రజల కోసమే చెరువును అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ రాఘవేంద్ర బదులిచ్చారు. ఈ విషయంపై కొద్దిసేపు పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

టీడీపీ హయాంలో బుద్ధవిహార్ ఎలా నిర్మించారని వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ మనోహర్ టీడీపీ కౌన్సిలర్లను నిలదీయగా చెరువులో బుద్ధవిహార్ లేదని ప్రతిపక్ష సభ్యులు రామలక్ష్మి, సైదేశ్వరరావు, వెంకట్ వాదించారు. దీంతో వైస్ చైర్మన్లు షేక్ హఫీజున్నీసా, ప్రభాకర్, కౌన్సిలర్ పందుల రోశయ్య, మనోహర్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు తదితరులు స్పందిస్తూ చెరువులో బుద్ధుని విగ్రహం ఉందని తాము నిరూపిస్తామని చెప్పారు. నిరూపించలేకపోతే రాజీనామా చేస్తా మంటూ సవాల్ విసిరారు. ఈ సమయంలో చైర్మన్ రాఘవేంద్ర జోక్యం చేసుకుని కౌన్సిలర్లంతా సంయమనం పాటించాలని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఎజెండాలోని 77అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్లంతా కలిసి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జీవన ఎరువుల తయారీపై అవగాహన

కొణకంచి(పెనుగంచిప్రోలు): రసాయన ఎరువులు అధికంగా వాడితే భూమి సారం కోల్పోతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ(రావెప్)కార్యక్రమంలో భాగంగా కొణకంచి గ్రామంలోని రైతులకు జీవన ఎరువుల తయారీపై విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు జీవన ఎరువులను పశువుల ఎరువులో కలిపి ఆఖరి దుక్కిలో చల్లుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలుంటాయన్నారు. ఆఖరి దుక్కిలో ఒక ఎకరానికి 5 కిలోల సూడోమోనాస్ జీవన ఎరువును బాగా కుళ్లిన 100 కిలోల పశువుల ఎరువులో కలిపి నీడ ప్రదేశంలో ఆరబెట్టుకోవాలన్నారు. 7 నుంచి 10 రోజుల తరువాత ఆ ఎరువును ఆఖరి దుక్కిలో చల్లుకుంటే నేల నుంచి సంక్రమించే తెగుళ్లను అరికట్టుకోవచ్చని తెలిపారు. ఈ జీవ ఎరువులు నేల భౌతిక లక్షణాలను మెరుగుపరచి మొక్కల పెరుగుదలకు దోహదపడతాయని వారు వివరించారు. కళాశాల విద్యార్థులు ఎల్.మాల్యాద్రి, కె.మాధవి, ఐ.జగదీష్‌నాయక్, కె.కిరణ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.



జీవన ఎరువు తయారు చేస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ లెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు వెంకటరత్నం, బాలాజీ

కంచికచర్ల : స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయం ఆవరణలో 2024వ సంవత్సరం యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈఓ-1 ఆదూరి వెంకటరత్నం, ఎంఈఓ-2 బి.బాలాజీ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి డి.హరిప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు, కంచికచర్ల సంఘ అధ్యక్షుడు మేరుగ రామారావు, జనరల్ సెక్రటరీ కోపూరు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ చలపతిరావు, ట్రెజరర్ మల్లారపు రామారావు, జిల్లా కౌన్సిలర్ ఎస్.పుల్లారావు, సెక్రటరీలు టి.వెంకటేశ్వరరావు, పి.కుమారస్వామి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.